ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

సోమవారం 5 మే 2025

ప్రశాంతంగా నీట్
- 18 మంది గైర్హాజరు
- ఆలస్యంగా వచ్చిన ఒక అభ్యర్థినికి అనుమతి నిరాకరణ
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ 7

పట్టుబట్టి సాధించారు..
- జూనియర్ సివిల్ జడ్జిలుగా ఉమ్మడి జిల్లా యువత 6

పరిష్కారం దిశగా అడుగులు..





- జిల్లాలో అమల్లోకి భూ భారతి చట్టం
- పైలట్ ప్రాజెక్టుగా బుగ్గారం మండలం ఎంపిక
- నేడు లాంఛనంగా ప్రారంభానికి ఏర్పాట్లు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

జగిత్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో నూతన విధి విధానాలతో భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలట్ మండలాలుగా ఎంపిక చేసి అమలు చేసింది. అనంతరం అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని రెండో విడత పైలట్ మండలంగా ఎంపిక చేసి ఈనెల 5వతేదీ నుంచి భూ భారతి అమలు చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని బుగ్గారం మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా అమలును ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలు భూ భారతితోనైనా పరిష్కారం అవుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల అభి ప్రాయాలు సేకరించడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించి భూ సమస్యలకు పరిష్కారం చూపనున్నారు.

● రెండు బృందాలుగా అధికారులు..

బుగ్గారం మండలంలో అధికారులను రెండు బృందాలుగా విభజించి గ్రామ సభలను నిర్వహించడానికి ప్రణాళికను ఖరారు చేశారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు నిర్ణీత రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. మొదటి బృందంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తుండగా బుగ్గారం తహసీల్దార్ మజీద్, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, రికార్డు అసిస్టెంట్ స్వామి, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌లు బృందం సభ్యులుగా ఉన్నారు. ఈనెల 5వ తేదీన యశ్వంతరావుపేట, 6న శెకల్లా, 7న గంగాపూర్, 8న గోపులాపూర్, సిరివంచకోట, 9న బుగ్గారంలో సభలు నిర్వహిస్తారు. రెండో బృందంలో ల్యాండ్ అండ్ సర్వే విభాగం ఏడీ వెంకటరెడ్డి ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తుండగా ధర్మపురి తహసీల్దార్ క్రిష్ణ చైతన్య, గిర్దావర్ బాపురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ జనార్దన్‌లు బృందం సభ్యులుగా ఉన్నారు. వీరు ఈనెల 5వ తేదీన మద్దునూరు, 6న సిరికొండ, 7న వెల్గొండ, 8న చిన్నాపూర్‌లలో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించనున్నారు.

● సాదా బైనామాలకు మోక్షం

రెవెన్యూ రికార్డుల్లో గతంలో పట్టాదారు కాలమ్‌తో పాటు కబ్జాదారు కాలమ్ కూడా ఉండేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చినప్పుడు కబ్జా కాలమ్‌ను తొలగించి పట్టాదారు కాలమ్‌ను మాత్రమే రికార్డుల్లో ఉంచింది. దీంతో గతంలో భూములు కొని పట్టాలు చేసుకోని వారు, సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వారు కబ్జాల్లో ఉన్నప్పటికీ వారికి ఆ భూమిపై హక్కులు లేకుండా పోయాయి. గతంలో అమ్ముకున్న వారికే ధరణిలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. ధరణి అమలులో భాగంగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములన్నింటినీ ఆన్‌లైన్ చేసే సందర్భంలో ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరుతో ...

మిగతా 8లో..

సాదాబైనామాల దరఖాస్తులు ఇలా...

బుగ్గారం	166
చిన్నాపూర్	65
గంగాపూర్	33
గోపులాపూర్	78
మద్దునూర్	184
శెకల్ల	91
సిరికొండ	36
సిరివంచకోట	48
వెల్గొండ	114
యశ్వంతరావుపేట	88
మొత్తం	903

● మండలంలో 19,735 ఎకరాల భూమి

బుగ్గారం మండలం పరిధిలో 10 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 19,735.36 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. ఇందులో 360.35 ఎకరాల ఆబాది, నద్దినాలా, రాస్తా భూములున్నాయి. మండలంలో 2,474.25 ఎకరాల అటవీ భూమి, 7,113.20 ఎకరాల ప్రభుత్వ భూమి, 716.38 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. మండలంలో 303.10 ఎకరాలకు చెందిన 358 పెండింగ్ ఖాతాలున్నాయి. 903 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

మహనీయుల జీవనం ఆదర్శనీయం

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవనం ఆదర్శనీయమని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఆదివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కఠోరమైన దీక్షతో దివి నుంచి భువికి గంగను రప్పించిన మహర్షి భగీరథుడుగా గుర్తించబడుతున్నాడన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి హకీమ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, బీసీ సంఘ నాయకులు ముసిపట్ల నారాయణ పాల్గొన్నారు.

'దివ్యాంగులకు పెన్షన్ ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెన్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని జిల్లా దివ్యాంగుల సంఘం నాయకులు లంక దాసరి శ్రీనివాస్ ఆరోపించారు. 6 వేల రూపాయల పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ వాగ్దానం చేసి విస్మరించిందని విమర్శించారు. ప్రతీ నెల 5వ తేదీలోపు తమ ఖాతాల్లో పెన్షన్ డబ్బులు వేయకుంటే జిల్లాలోని 5 వేల మంది దివ్యాంగులతో జిల్లాను దిగ్బంధనం చేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

● పెగడపల్లి మండలంలో రూ.17.9 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ ● ఏర్పాట్లు పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ అడ్లూరి



మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న విప్ అడ్లూరి

జగిత్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్,రోడ్లు భవనాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పెగడపల్లి మండలం కీచులాటలపల్లిలో పలు అభివృద్ధి పనుల్లో మంత్రి సీతక్క పాల్గొననున్నారు. పెగడపల్లి, ఎండపల్లి, ధర్మపురి, వెల్గటూరు మండలాల్లో రహదారుల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, సీఆర్ఆర్ పథకాల కింద మంజూరు చేసిన రూ.17.90 కోట్ల నిధులతో ఏడు పనులకు ఆమె భూమి పూజ చేసి ప్రారంభించనున్నారు. మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలువురు అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి సీతక్క పర్యటన షెడ్యూల్ ఇలా..

ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటన ముగిసిన అనంతరం మంత్రి సీతక్క మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండపల్లి ఎక్స్ రోడ్డు వద్దకు రానున్నారు. 3.45 ఎండపల్లి ఎక్స్ రోడ్డు నుంచి పెగడపల్లి మండలం కీచులపల్లి గ్రామానికి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు కీచులాటలపల్లిలో పలు రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన శిలా ఫలకాలను ఆవిష్కరిస్తారు. 4.50 గంటలకు కీచులాటలపల్లి నుంచి బయలు దేరి పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చేరుకుంటారు. సాయంత్రం 5గంటలకు ఎల్లాపూర్‌లో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు ఎల్లాపూర్ నుంచి రోడ్డుమార్గాన బయలు దేరి కరీంనగర్, సిద్దిపేట మీదుగా హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్‌లో గల తన నివాసానికి తిరుగు ప్రయాణం అవుతారు. ఈమేరకు జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రి సీతక్క పర్యటన షెడ్యూల్ అందింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి ఫీడర్ వద్ద చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి వ్యవసాయ బావులకు, గ్రామంకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

విద్యార్థులకు అభినందన

రాయికల్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్సెస్సీలో ప్రతిభ చాటగా ఆదివారం ఎంఈవో శ్రీపతి రాఘవులు సన్మానించారు. శైలజ 544 మార్కులు, కండ్లపెల్లి రక్షిత 543, పెద్ది మహిత 539 మార్కులు సాధిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రవీందర్, మల్లేశం, గంగ జమున, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పెద్దమ్మ తల్లి జాతర



అమ్మవారి విగ్రహాలను ఆలయానికి తీసుకొస్తున్న పూజారులు

మల్లాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామంలోని పెద్దమ్మ జాతర వేడుకలు ఆదివారం ఘనంగా ముగిసాయి. నాలుగు రోజుల నుంచి భక్తులు అమ్మ వారి జాతర భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా అమ్మ వారి విగ్రహాన్ని భక్తుల దర్శనార్థం ఓ మైదానంలో ప్రత్యేక వేదిక వద్ద ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం నీలగిరి పెద్దమ్మ తల్లి విగ్రహంను మంగళహారతుల నడుమ గుడికి చేర్చి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో పాటు పలు నాయకులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వాకిటి భూమారెడ్డి, బొల్లం ప్రకాష్, కొమ్ముల రాజారెడ్డి, రాజారెడ్డి, తేలు సాయి, బొల్లం రఘు పాల్గొన్నారు.

నేడు వక్ఫ్ సవరణ చట్టంపై ర్యాలీ

జగిత్యాల అర్బన్, మే4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జగిత్యాల జిల్లా కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రజావాణి యథాతథం

జగిత్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి అవగాహన సదస్సుల కారణంగా రద్దు చేయబడిన ప్రజావాణిని తిరిగి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని సూచించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై నవీన్‌కుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని రాజారాం తండాలో మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే 1936 నంబర్‌కు డయల్ చేయాలని అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవద్దన్నారు. చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కళాజాత బృందం ఆటా, పాటలతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ రమేశ్, మాజీ సర్పంచ్ లావణ్య సరితరవీందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మేగా నాయక్, చంద్రు నాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మండల శాఖ అధ్యక్షుడు చెవుల రవీందర్ తండ్రి రాయలింగు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావుతో కలిసి ఆదివారం పరామర్శించారు. శ్రీరాములపల్లెలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాజెంగి మల్లేశం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, జగిత్యాల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తాండ్ర సురేందర్, నాయకులు లంబ లక్ష్మణ్, నేరేళ్ల రాజిరెడ్డి, కిష్టంపాట రమేష్ రెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, రాంచరణ్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని పీఆర్‌బీఎం కళాశాలలో 1992-94, 1993-95 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని శివసాయి గార్డెన్‌లో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపన్యాసకులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారు చిన్నతనంలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా కల్యాణ మండపం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పీఆర్‌బీఎం కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్‌లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి..

సిరిసిల్ల క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): పుట్టినప్పటి నుంచే ఉన్న వైకల్యాన్ని జయించి.. న్యాయమూర్తిగా నిలిచిందామె.. అమ్మ, నాన్నల ప్రోత్సాహంతో జూనియర్ సివిల్ జడ్జిగా జాహ్నవి ఎంపికైంది. ఇటీవల విడుదలైన తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో 29 ఏళ్ల వయస్సులోనే జాహ్నవి ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని చేరింది. చిన్నప్పటి నుంచే న్యాయమూర్తి కావాలనే కోరిక ఎట్టకేలకు నెరవేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణం భీమేశ్వరాలయం వీధికి చెందిన సంకెపల్లి సుమనారాణి, హరికిషన్‌లకు ఇద్దరు సంతానం. కొడుకు వరుణ్‌కుమార్, కూతురు జాహ్నవి. హరికిషన్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. వరుణ్‌కుమార్ ఎంబీఏ చదివి ఉద్యోగం చేస్తున్నాడు. జాహ్నవి చిన్నప్పటి నుంచే వైకల్యం ఉండడంతో పక్కన ఉండే దేవయ్య బడికి వెళ్లి 3వ తరగతి వరకు చదివింది. ఆ తర్వాత వేములవాడ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల్లో బీకాం చదివింది. జ్యుడిషియల్ ఆఫీసర్ కావాలనే కోరికతో ఆంధ్రమహిళా సభలో ఎల్ఎల్‌బీ పూర్తిచేసింది. 2019లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని వేములవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా చేరింది. తర్వాత పట్టుదలతో పీజీఎల్‌సెట్‌లో ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం క్యాంపస్ సీటు పొంది లేబర్ లా పూర్తిచేసింది. ఆ తర్వాత జేఆర్ఎఫ్ రాసి ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో లేబర్‌లాలో పీహెచ్‌డీ చేసింది. యూనివర్సిటీలో చదవు కొనసాగిస్తూనే నాలుగేళ్లుగా జ్యుడిషియల్ (జేసీజే) పరీక్ష రాస్తోంది. జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ఇంటి వద్దనే రోజుకు 10 గంటలు చదివి 2020లో ప్రిలిమినరీ పరీక్షకు మొదటిసారి హాజరైంది. తర్వాత పట్టుదలతో చదివి నాలుగో ప్రయత్నంలో 2024 జూన్‌లో ప్రిలిమ్స్ అర్హత సాధించింది. నవంబర్‌లో మెయిన్స్ రాసి మెరిట్ సాధించి 2025 ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేసి జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైంది.


జాహ్నవి

● అమ్మ, నాన్నల ప్రోత్సాహం ఎంతో ఉంది..

- సంకెపల్లి జాహ్నవి

ఇంటర్ తర్వాత లా చదివి జడ్జి కావాలని కోరిక. బీకాం డిగ్రీ పూర్తయ్యాక లా చదివాను. ఇందుకు అమ్మ సుమనారాణి, నాన్న హరికిషన్, అన్నయ్య వరుణ్‌కుమార్ ప్రోత్సాహం ఎంతో ఉంది. నేను ఏ పోటీ పరీక్ష రాయాలన్నా నాకున్న వైకల్యం కారణంగా అమ్మ, నాన్నలు వెంట వచ్చేవారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రోజుకు 10గంటలు చదివేదాన్ని. చివరికి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో నా కల నెరవేరింది.

పట్టుబట్టి సాధించారు..

జూనియర్ సివిల్ జడ్జిలుగా ఉమ్మడి జిల్లా యువత

వారు కష్టాలు ఎదురైనా అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. కష్టపడి చదివి న్యాయమూర్తులుగా ఎదిగారు. చిన్న వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎదిగి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పేదింట వికసించిన విద్యాకుసుమం

జగిత్యాల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నిరు పేద కుటుంబం నుంచి వచ్చి ఖర్చుల కోసం పార్ట్ టైం జాబ్ చేస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు పట్నం నరేష్(26). జగిత్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన కనకయ్య, యాదవ్వ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. గ్రామంలో అద్దెకు ఉంటూ పొట్టకూటి కోసం నరేష్ తండ్రి కనకయ్య హమాలీగా పనిచేస్తుండగా తల్లి యాదవ్వ కూలి పని చేస్తున్నారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో నరేష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. 2024లో నరేష్ హైదరాబాద్‌లో ఎల్ఎల్ఎం పూర్తి చేసి ఓ లాయర్ వద్ద పార్ట్ టైం జాబ్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యాడు. ఎట్టకేలకు అనుకున్నది సాధించడంతో నరేష్ ఆనం దానికి అవధులు లేకుండా పోయింది. కొడుకు ఉద్యోగం సాధించడంతో తమ కుటుంబ కష్టాలు తీరినట్టేనని నరేష్ తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పట్నం నరేష్

కష్టాలను అధిగమించి..

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆమెది చేనేత కార్మికురాలి కుటుంబం.. తండ్రి అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు... తల్లి చేనేత కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది... కష్టపడి చదివి తాజాగా వెలువడ్డ ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై యువతకు స్ఫూర్తినిచ్చింది. హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామా నికి చెందిన బత్తుల మల్లేశం- నర్మదలకు ముగ్గురు సంతానం. అందులో చిన్నకూతురైన మా నస చిన్నప్పటి నుంచే చదువు మీద ఆసక్తి ఉండేది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మానస మేనత్త ఉమాదేవి-మనోజ్‌లు ఆమెను చదివించారు. మానస చదువుకోవడానికి ఆర్థికంగా సహాయ పడ్డారు. మానస ఎల్కతుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ హుజూరాబాద్‌లో చదువుకుంది. హనుమకొండలోని కాకతీయ యూనివర్సి టీలో ఎంఏ సోషియాలజీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగ ప్రకటన చేయగా ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉత్తమ ఫలితం సాధించి ఇంటర్వ్యూకు అర్హత సాధించింది. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిగా చేసి జూనియర్ సివిల్ జడ్జిగా మానస ఎంపికైంది.


బత్తుల మానస

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పుల్లూరి త్రివేణి అనే మహిళ కోతులదాడిలో ఆదివారం తీవ్రంగా గాయపడింది. కోతులు ఒక్కసారిగా ఆమెను కరవడంతో కాలుకు తీవ్రగాయమైంది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే మహిళను ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలో పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాల శివారులో పేకాడుతున్నారన్న పక్కాసమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు జూదమాడుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారివద్ద రూ.2820 లభించాయని తెలిపారు. వారిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆమె తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో బెల్టుషాపుల్లో ఉన్న అక్రమమద్యంను ఆదివారం పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. గంగాధర గ్రామంలో 4బెల్టుషాపులు, హిమ్మత్ నగర్‌లో ఒక్క బెల్టుషాపుల్లో తనిఖీచేయగా 86లీటర్ల అక్రమ మద్యం లభించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టుషాపు నిర్వహకులపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

కూలిన వడ్ల లోడ్.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వడ్లలోడ్ ట్రాక్టర్‌నుంచి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామం నుంచి మానకొండూర్ మండలంలోని ఓసీడ్ ప్లాంట్‌లోకి రైతు వడ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు దాటుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ నుంచి వడ్లబస్తాలు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో రోడ్డు పక్కన ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బాకురు పల్లి తండాకుచెందిన రమావత్ బాల్య(71) ఈనెల3న రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని వృద్ధుడు బాల్య పింఛన్ డబ్బులు తీసుకునేందుకు మండలంలోని రాచర్ల గొల్లపల్లికి వచ్చాడని పేర్కొన్నారు. రోడ్డు దాటుతున్న గ్రామంలో వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడన్నారు. మొదట సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారని తెలిపారు. చివరికి పరిస్థితి విషమించి వృద్ధుడు బాల్య మృతి చెందాడన్నారు. మృతుడికి ఇద్దరు కొడుకులు లాల్‌సింగ్, మోహన్, వివాహమైన ముగ్గురు కూతుళ్ల ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీ సులు వివరించారు.

చింతచెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన పెద్ది ఆదిరెడ్డి(75) చింతచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. శనివారం ఆదిరెడ్డి చింతచెట్టు ఎక్కి చింతకాయలు దులుపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారిపడగా గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆదిరెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి మేనల్లుడు బండ భూపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

బీర్‌పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం గణపతిదేవ్‌రావ్ టార్వే(34) అనే వ్యక్తి మృతి చెందినట్లు బీర్ పూర్ ట్రైనీఎస్సై రాజు తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నంద గావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావ్ టార్వే తన స్నేహితుడైన సూర్యభాను మారుతితో కలిసి పీతలను పట్టడానికి శనివారం రాత్రి రోళ్లవాగు ప్రాజెక్టుకు వచ్చాడు. ఆ సమయంలో పాముకాటుకు గురై 100 నంబర్‌కు డయల్ చేశాడు. దీంతో బీర్‌పూర్ పోలీసులు వెంటనే స్పందించి బాధితుడిని అటవీప్రాంతం నుంచి తీసుకువచ్చి అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గణపతిదేవ్ రావ్ టార్వే ఆదివారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవ

● ఆటోలో డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి అప్పగింత

కోల్‌సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆటోలో క్యాష్ బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలికి బ్యాగు అప్పగించి తన బాధ్యతను చాటుకున్నారు రామగుండం పోలీసులు. గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెసరి సునీత ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్ నుంచి గోదావరిఖని బస్టాండ్ వరకు ప్రయాణించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగ్‌ను ఆటోలు మరిచిపోయింది. విషయాన్ని పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసులకు తెలుపడంతో సీఐ రాజేశ్వర్‌రావు బస్టాండ్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి ఆటో నంబర్‌ను గుర్తించారు. సమాచారాన్ని ఆటోల నిర్వాహకులకు తెలిజేయగా వారు సదరు ఆటో డ్రైవర్‌కు విషయం చెప్పడంతో అతడు ఆటోలో చూడగా క్యాష్ బ్యాగ్ అగుపించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగును తిరిగి ప్రయాణీకురాలు పెసరి సునీతకు సీఐ రాజేశ్వర్‌రావు అప్పగించారు.


ప్రయాణికురాలు సునీతకు బ్యాగు అందజేస్తున్న సీఐ రాజేశ్వర్‌రావు

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

● సెంటినరీకాలనీలో ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

రామగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో వేముల వసంత్(27)అనే యువకుడు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వసంత్ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో సీ-5 ప్రైవేట్ ఓబీ కంపెనీలో వోల్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్స్‌లో పాల్గొని డబ్బులు కోల్పోయిన వసంత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్వార్టర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో పాల్గొని వసంత్ నాలుగు లక్షల మేరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తండ్రి రవిశంకర్‌కు తెలియడంతో కుమారుడిని మందలించి గతేడాది డిసెంబర్‌లో పూర్తిగా అప్పు చెల్లించాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన వసంత్ తిరిగి అదే వ్యవహారం కొనసాగించినట్లు తెలిసింది. ఆదివారం ఉదయం సుల్తానాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు తల్లిదండ్రులు వెళ్లారు. అప్పువిషయం వారికి తెలిస్తే మందలిస్తారనే భయంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


వసంత్ (ఫైల్)

విద్యుత్ తీగలు తెగిపడి అగ్నిప్రమాదం

● పలు వాహనాలు, 25 క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధం ● రూ.8 లక్షల నష్టం

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో ఆదివారం గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. టాటాఏస్, స్కూటీ వాహనాలు ఆరుబయట ఆరబెట్టిన 25 క్వింటాళ్ల మొక్కజొన్న పంటపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కాలనీ వాసులు తీవ్రభయాందోళనకు గురై విద్యుత్ అధికారులకు సమాచామందించారు. వెంటనే విద్యుత్‌అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


దగ్ధమైన టాటా ఏస్ వ్యాన్



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మికసంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగసంఘాలు స్వతంత్ర్య ఫెడరేషన్లు పిలుపు నిచ్చాయన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు..్నరు.

ఈదురు గాలులు.. వర్షం

● విరిగిపడిన చెట్లు ● తడిసిన ధాన్యం


చిన్నముల్కనూర్‌లో నేల కొరిగిన చెట్లను తొలగిస్తున్న ఎస్సై జగదీష్


తిమ్మాపూర్‌లో తడిసిన ధాన్యం


మృత్యువాత పడిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు రాజు

హుజూరాబాద్/శంకరపట్నం/జమ్మికుంట రూరల్/చిగురుమామిడి/తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుమండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఆరుబయటకు వచ్చి సేదతీరారు. కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబోసిన రైతులు తమ ధాన్యాన్ని అంతా ఒక దగ్గరికి కుప్పచేసుకొని టార్పాలిన్లు కప్పారు. సుమారు 2గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్, చిగురుమామిడి తదితర గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు విరిగిరోడ్లకు అడ్డంగాపడ్డాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపోయాయి. ఇన్‌చార్జి ఎస్సై జగదీష్ అధ్వర్యంలోచెట్లను, విద్యుత్‌స్తంభాలను తొలగించారు. ఇందుర్తి గ్రామంలో అందె రాములు ఇల్లు కూలిపోయింది. గునుకులపల్లిలో మామిడిచెట్లు కూలిపోయాయి. తోటల్లో చెట్లకు ఉన్న కాయలు రాలిపోయాయి. ఇదే గ్రామంలో కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవగా రైతు భద్రాచలం రోదిస్తూ ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

బీర్‌పూర్‌లో వడగళ్ల వాన

బీర్‌పూర్: జగిత్యాలజిల్లా బీర్‌పూర్ మండలంలోని పలుగ్రామాలలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతోకూడిన వడగళ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. బీర్‌పూర్ మండలకేంద్రంలో ఈదురుగాలులకు పోలీస్ స్టేషన్ ఎదుటచెట్టు విరిగిపోవడంతో రాకపోకలకుఅంతరాయం కలిగింది. విద్యుత్‌స్తంభం విరిగిపడిపోగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో పిడుగుపాటుకు రైతు బానోతు రాజుకు చెందిన ఆవు ఆదివారం మృత్యువాత పడింది. రాజు తన వ్యవసాయ పొలం వద్ద ఆవును కట్టేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వీచి ఒక్కసారిగా పిడుగు పడడం వల్ల ఆవు మృతిచెందింది. ఆ ప్రాంతమంతా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రైతు రాజు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని రోదించారు. ఆవు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు రాజు తెలిపారు. కాగా రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తాజా, మాజీ సర్పంచ్ రజిత-తిరుపతినాయక్ కోరారు.

● సారంపల్లిలో గేదె మృతి..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో రాముల లింగయ్య అనే రైతుకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. సుమారు రూ.లక్షనష్టం వాటిల్లిందని రైతు రాముల లింగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏటీఎంలో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని ఎస్‌బిఐకి చెందిన ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు బ్యాంక్ ఏటీఎంచానల్ ఎగ్జిక్యూటివ్ రజనీ కాంత్ కరీంనగర్ రెండోఠాణా పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. క్రిస్టియన్‌కాలనీలోని ఏటీఎంలో ఆదివారం ఉదయం 4:25నిమిషాలకు ఇద్దరు వ్యక్తులు ఏటీఎం ఫ్రంట్‌డోర్ తెరిచి క్యాష్ బయటకు వచ్చేమార్గంలో టేప్ అడ్డుపెట్టారని ముంబాయినుంచి సీసీటీవీ మానిటరింగ్ టీం గుర్తించింది. ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటివ్ రజనీకాంత్‌కు ఉదయం 5:38 గంటలకు ఫోన్‌చేసి అప్రమత్తం చేసింది. ఏటీఎంకు వెళ్లిపరిశీలించగా ప్లాస్టర్ అంటించినట్లు ఉంది. రజనీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుకరవాణా చేస్తున్న పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్‌డ్రైవర్లు రాపర్తి సతీష్, రాపర్తి శ్రీనివాస్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలం రేణిగుంట నుంచి గుండ్లపల్లికి ఆదివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై అరుణ్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

సుభాష్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చనేది అందరికీ తెలిసిన విషయం. అందులో చేతులు పరిశుభ్రంగా ఉంటేనే మిగతా విషయాల్లోనూ శుభ్రత పాటించవచ్చు. ప్రతి సంవత్సరం మే 5న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. మన చేతులు రోజంతా లెక్కలేనన్ని వస్తువులు, పరికరాలు తాకుతుంటాయి. చేతులపై క్రిములు పేరు కుపోతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. ఈ ఇనెఫెక్షన్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.



● చేతులు ఇలా శుభ్రం చేసుకోవాలి

ప్రజారోగ్యానికి చేతుల పరిశుభ్రత ఒక మూలస్తంభం. సబ్బు, నీటితో సరైన చేతులు కడుక్కోవడం లేదా ఆల్కాహాలు ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించడం వల్ల చేతుల నుంచి క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లను సమర్థవంతంగా తొలగించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఇంట్లో, పాఠశాలల్లో, కార్యాలయాలల్లో ఎక్కడైనా క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం వల్ల ఫ్లూ, జలుబు, జీర్ణశయాంతర ఇన్‌ఫెక్షన్లు వంటి సాధారణ అనారోగ్యాల వ్యాప్తిని నిరోధించవచ్చు. చేతులను తరుచుగా కనీసం 20 సెకన్లపాటు సబ్బు, నీటితో కడుక్కోవాలి. ముఖ్యంగా తినడానికి ముందు, రెస్ట్‌రూమును ఉపయోగించిన తరువాత, ముక్కు చీదిన తరువాత, దగ్గిన, తుమ్మిన తరువాత, జంతువులు, వాటి వ్యర్థాలను తాకినా తరువాత సబ్బు నీరు లేదా హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించి చేతులను శుభ్రం చేసుకోవాలి.

కొవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగింది..

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్

ఆరోగ్య పరిరక్షణలో చేతుల పరిశుభ్రత కీలకం. కొవిడ్ తర్వాత ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. లేదా హ్యాండ్ శానిటైజర్ వాడాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే శుభ్రతపై అవగాహన కల్పించాలి.



లెగ్ బీటింగ్ చేస్తున్న చిన్నారులు



డైవింగ్ చేస్తున్న చిన్నారులు

జోరుగా..హుషారుగా.. స్విమ్ చేద్దామా..

జాగ్రత్తలు..

- స్విమ్ చేసేముందు కాస్త జాగింగ్ చేసి స్నానం చేయడం తప్పనిసరి.
- స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- చర్మవ్యాధులు, అంటువ్యాధులు ఉన్నవారిని స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించవద్దు.
- పిల్లలు తమకు కేటాయించిన ప్రాంతంలోనే ఈత నేర్చుకోవాలి.



- స్విమ్ చేసేపుడు కోచ్ సూచనలు పాటించాలి. స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లు వినియోగించాలి. కోచ్‌ల పర్యవేక్షణలో నీటిలో కూర్చోవడం, తిరగడం, తేలడం, ఎగరడం, ఈదడం వంటివి తొలుత ప్రాక్టీస్ చేయాలి.
- చెవిలోకి నీరు వెళ్తే ఫంగస్ ఏర్పడుతుంది. ఇయర్ ప్లగ్స్ వాడాలి.
- తలవెంట్రుకలు రాలకుండా క్యాప్ వాడాలి.
- స్విమ్మింగ్‌లో శిక్షణ పొందాలనుకునే పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా స్విమ్మింగ్ డ్రెస్ ధరించాలి. స్విమ్ వేర్, హెడ్ క్యాప్, కంటి అద్దాలు, ఇయర్ ప్లగ్స్‌ను ధరించాలి.

- ఆనందానికి, వ్యాయామానికి ఈత
- కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల నుంచి పెద్దల వరకు వేసవిలో ఈతకు సిద్ధమవుతున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్స్‌లో సందడి పెరిగింది. పెద్దలతోపాటు పట్టణ ప్రాంత పిల్లలు ఈతపై మక్కువ పెంచుకుంటున్నారు. పల్లె ప్రజానీకం ప్రకృతి అందాల చెంత సేద తీరుతుండగా పట్టణ ప్రాంతాల వారు స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పలు స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో ఉన్నాయి. నిర్వాహకులు బ్యాచ్‌ల వారీగా శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు రావడంతో పూల్స్ ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతున్నాయి.

ఈతతో లాభాలెన్నో..

ఈత చక్కని వ్యాయామం. ఈత కొడితే అన్ని అవయవాలకు వ్యాయామం అందుతుంది. ఒంట్లో ఉన్న



అదనపు కొవ్వు కరుగుతుంది. మధుమేహంతో బాధ పడే వారికి ఉపశమనం లభిస్తుంది. నిత్యం ఈదడం ద్వారా ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయి. రక్తపోటు గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. ఊపిరితిత్తులకు మంచి వ్యాయామం లభిస్తుంది. సుమారు 50 నిమిషాలపాటు ఈత కొడితే 300 కాలరీల వరకు శక్తి ఖర్చవుతుంది. నీటిలో ఆపద సమయాల్లో మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా ఇతరులను కాపాడవచ్చు.

ఈత కొట్టే పద్ధతులు..

ఈతను నాలుగు విధాలుగా కొట్టవచ్చు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై విధానంలో ఈత కొట్టవచ్చు.

రక్షణ పద్ధతి డోవింగ్..

స్విమ్మింగ్ నేర్చుకున్న అనంతరం తప్పక ఈ రక్షణ పద్ధతి డోవింగ్(లైఫ్ సేవింగ్)ను నేర్చుకోవాలి. కొన్ని సందర్భాల్లో నీటిలో మునిగిపోతున్న వ్యక్తులనువారికి ఎలాంటి హాని కలుగకుండా రక్షించే పద్ధతి ఇది.

వేసవి సెలవుల సద్వినియోగం..

\- అరుణవ్‌పాల్‌సింగ్



ఈ వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ పూర్తిగా నేర్చుకుంటున్నాను. దీంతో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ శిక్షణలో చేరాను.

సరదాగా ఉంది..

\- రేనుశ్రీ, హిమాన్షు



ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నాయి. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు స్విమ్మింగ్ మంచి మార్గం. స్విమ్మింగ్ చేస్తుంటే సరదాగా ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నాను.

ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్..

\- సంపత్ కుమార్, కోచ్



విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్. ప్రతిరోజు స్విమ్మింగ్ చేస్తే ఫిట్‌నెస్ పెరుగుతుంది. నీటి ప్రమాదాల నుంచి బయట పడేందుకు దోహదపడుతుంది. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

స్విమ్మింగ్ సర్వరోగ నివారణి..

\- వి.శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో



స్విమ్మింగ్ సర్వరోగ నివారణిగా ఉపయోగపడుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజు స్విమ్మింగ్ చేయవచ్చు. అంబేద్కర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌లతో విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణను అందిస్తు న్నాం. ఈ మధ్యనే స్విమ్మింగ్ పూల్‌ను ఆధునీక రించాం. చిన్నారుల కోసం బేబీ పూల్‌ను ప్రారం భించాం. విద్యార్థులు, యువత నుంచి ఈ వేసవిలో మంచి స్పందన లభిస్తుంది.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటలు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు చేరుకొని పూజలు నిర్వహించారు. డీపీవో వీర బుచ్చయ్య దంపతులు, జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు కుటుంబాల వారీగా ఆలయంలో అర్చనలు, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులసంఖ్య పెరగడంతో క్యూలో రెండుగంటలపాటు వేచిఉండి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ మద్దసాని కుమారస్వామి డీపీవో దంపతులను సన్మానించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

రూ.3 కోట్లతో ఉడాయించిన ఇద్దరు వ్యాపారులు

- లబోదిబోమంటున్న బాధితులు

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇద్దరు వ్యాపారులు సుమారు రూ 3 కోట్లు అప్పులు తీసుకుని ఉడాయించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి రాచర్లగొల్లపల్లికి వలస వచ్చి స్థానికబట్టల దుకాణం నిర్వహించేవాడని తెలిసింది. అతన్ని నమ్మిన పలువురు రూ1.50కోట్లవరకు బాకీలు ఇచ్చారని సమాచారం. స్థానికంగా నివసిస్తున్న మరోబట్టలు, సూపర్‌మార్కెట్ వ్యాపారి సైతం నష్టాలపాలయ్యాడని తెలిసింది. ఆయనరూ.1.50కోట్ల వరకు అప్పులు చేశాడని సమాచారం. బాకీల వారి బాధలు అధికమవడంతో రెండురోజుల కిందట ఇద్దరు వ్యాపారులు ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉడాయించారని తెలిసింది. రెండు రోజులుగా వ్యాపారులు కనిపించకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు ఆదివారం జరిగిన ఇంజనీరింగ్ విభాగం పరీక్షలో కరీంనగర్ జోన్‌లో 12పరీక్ష కేంద్రాలలో కలిపి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటిసెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,432మంది హాజరయ్యారు. 103మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,451మంది హాజరు కాగా 84మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. మొత్తంగా 5,070 మంది అభ్యర్థులకు గాను 4,883 మంది అభ్యర్థులు హాజరు కాగా 187మంది గైర్హాజరైనట్ల నిర్వాహకులు తెలిపారు.



బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్థులు

ఖాసీంపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసీంపేటలో గ్రామస్థులంతా కలిసి ఆదివారం పోచమ్మబోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండి ప్రజలంతా ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గంప మల్లీశ్వరి, మాజీఎంపీటీసీ ఏలేటి స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, బీజేపీ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- దర్శనానికి మూడు గంటల సమయం
- దర్శించుకున్న హైకోర్టు జడ్జి



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సెలవురోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, ఆవరణతో పాటుగా క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం సాయంత్రం చేరుకున్న భక్తులు ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున భక్తులు ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు బారులుతీరారు. కోడెమొక్కు క్యూలైన్‌లో సుమారు మూడు గంటలపాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల తాకిడి దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లోను భక్తులను అనుమతించారు. దీంతో క్యూలైన్‌లు అన్ని భక్తులతో సందడిగా మారాయి. ఆయా క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీస్వామివారికి కోడెమొక్కు చెల్లించుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. గండాదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొని అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి మధుసూదన్‌రావు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ హైకోర్టు జడ్జి బీ.ఆర్.మధుసూదన్‌రావు తన కూతురుతో కలిసి దర్శించుకున్నారు. శనివారం రాత్రి వేములవాడకు చేరుకున్న జడ్జికి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పుష్పలత, సీనియర్ సివిల్ జడ్జిలు అజయ్‌కుమార్ జాదవ్, లక్ష్మణాచారి, ప్రోటోకాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం రాజన్న దర్శనానికి విచ్చేసిన జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శ్రీస్వామివారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ..

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ చంద్రకాంత్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసి శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



జడ్జి మధుసూదన్‌రావుకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్



చంద్రకాంత్‌కు రాజన్న ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో రెండో రోజు ఆదివారం నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సామవేద పారా యణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి వారు

ప్రశాంతంగా నీట్

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ



ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్‌ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2975 మంది విద్యార్థులకు 2914 మంది పరీక్ష రాశారు. 61 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, ఎస్సారార్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసీల్దార్ రాజేష్ ఉన్నారు.

- వివిధ నీట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

- మూడు నిమిషాల ఆలస్యంతో..



క్యూలో వేచి ఉన్న విద్యార్థులు

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల కేంద్రంలో మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో వేములవాడకు చెందిన కుమ్మరి వైష్ణవి పరీక్షను కోల్పోయింది. వైష్ణవితోపాటు ఆమెతల్లి పరీక్షకు అనుమతించాలని అధికారులను కోరుతూ విలపించారు. సంవత్సరం వృథా అవుతుందని, పుస్తెలతాడు అమ్మి లక్షా 60వేలతో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించామని, పరీక్షకు హాజరయ్యేందుకు రాగా కేవలం మూడు నిమిషాల ఆలస్యంతో అధికారులు అనుమతించలేదని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరో విద్యార్థికూడా ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి రాగా అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రంలో 384మంది అభ్యర్థులకు గాను 378మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల(సీవోఈ)లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 480మంది 467మంది హాజరు కాగా 13మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష సమయానికి అరగంట ముందే అంటే 1.30గంటలకు పరీక్ష కేంద్రాల వద్ద గేట్లను మూసేశారు. నిమిషం నిబంధన కారణంతో కేంద్రీయ విద్యాలయానికి ఒక విద్యార్థిని అలస్యంగా రాగా ఆమెను అధికారులు అనుమతించలేదు. దీంతో అమ్మాయి నిరాశతో వెనుతిరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్‌తోపాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలుగునూర్‌లోని రెండు నీట్‌పరీక్ష కేంద్రాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, అదనపుకలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి, కళాశాలలోని రెండు కేంద్రాల్లో 758 మంది విద్యార్థులకు గాను 740 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మొదటి పరీక్షా కేంద్రంలో 480 మందికి 467 మంది, రెండో పరీక్షా కేంద్రంలో 278 మందికి 273 హాజరైనట్లు పరీక్షల సూపరింటెండెంట్లు డాక్టర్ ఎస్.జగదీష్‌కుమార్, డాక్టర్ సురేష్ శ్రీపాద తెలిపారు. మల్లాపూర్ మండలం వీపీ రావుపేటకు చెందిన నవ్య అనే విద్యార్థిని రెండు నిమిషాలు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించ లేదు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రభాకర్, తహసీల్దార్ రమేష్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ బందోబస్తు నిర్వహించారు.



విద్యార్థిని కంకణాన్ని తీస్తున్న పేరెంట్



ముక్కుపుడక తీస్తున్న విద్యార్థిని



పుస్తెలతాడు అమ్మానంటూ పసుపుతాడును చూపుతున్న వైష్ణవి తల్లి



కన్నీటి పర్యంతమైన వైష్ణవి, తల్లిదండ్రులు

ఆర్థిక సహాయం

బీర్‌పూర్, మే 4(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గుండా లచ్చన్నగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గౌడ సంఘం నాయకులు ఆదివారం మృతుడు లచ్చన్న కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలుపుతూ రూ. 5000 అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బైరవేణి సత్యనారాయణ గౌడ్, సతీష్‌గౌడ్, కృష్ణమూర్తి, మల్లేశ్, శ్రీను, సత్యంగౌడ్, సుదీర్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటలో ఆదివారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. చింత రాజేశ్‌కు రూ. 32,500, కనికరపు రాజేశంకు రు. 42,500, అలకుంట లక్ష్మికి రూ. 60 వేల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవీంధర్, తోకల దేవయ్య, నవీన్, ముదాం గంగాధర్, దయ్య గంగారాం ఉన్నారు.

భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి) :జగిత్యాలరూరల్ మండలంలోని గుల్లపేటలో ఆదివారం భక్త మార్కండేయ దేవాలయంలో ధ్వజస్థంబం, నవగ్రహాల విగ్రహ ప్రతిస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ సర్పంచ్ రాధకిషన్‌రావు పాల్గొన్నారు.

●జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామంలో ఆదివారం భక్త మార్కండేయ దేవాలయంలో ధ్వజ స్థంబం, నవగ్రహాల విగ్రహ ప్రతిస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.

అంగన్‌వాడీలకు సెలవులపై హర్షం

జగిత్యాల అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడి కేంద్రాలకు మే నెల మొత్తం సెలవులు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు ఏ. రజిత, ప్రధాన కార్యదిర్శి గుగ్గిల స్వప్నలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మే నెల మొత్తం అంగన్‌వాడి సెంటర్‌లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తు గత కొన్ని రోజులుగా అంగన్‌వాడి టీచర్లు , హెల్పర్‌లు చేస్తున్న ఆంధోళనలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు ముఖ్యమంత్రి, శిశు సంక్షేమశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్‌స్కూల్ పిలుస్తోంది..!

-ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం -ఈనెల 20 వరకు గడువు

జగిత్యాలరూరల్, మే4 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో అన్ని సౌక ర్యాలతో అంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరారు.



కండ్లపల్లి మోడల్‌స్కూల్

●జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఆంగ్లమాధ్యమంలో ఈనెల 5 నుంచి 20 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరితాదేవి కోరారు. దరఖాస్తులకు ఎలాంటి ఫీజు లేదన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 26న ప్రకటిస్తామని తెలిపారు. ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

●ప్రతి కోర్సులో 40 సీట్లు..

తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి 20 వరకు తెలంగాణ ఎంఎస్.సీజీజీ.గౌట్.ఇన్ వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆంగ్లమాధ్యమంలో బోధన
-సరితాదేవి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్



గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో ఆదర్శ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో విద్యా బోధన జరుగుతుంది. నాణ్యమైన ఆంగ్ల బోధనతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈనెల 20లోపు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

భార్య కాపురానికి రావడం లేదని అత్తగారింటి ఎదుట బైఠాయింపు

-మద్దతు తెలిపిన మహిళా సంఘాలు

కోరుట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని ఆదివారం పట్టణంలోని ఝూన్సిరోడ్డులో గల అత్తగారింట ఎదుట గాజుల అజయ్ తన కుటుంబ సభ్యులతో ఆదివారం ఆందోళనకు దిగాడు. స్థానికుల వివరాల ప్రకారం ఝూన్సిరోడ్డుకు చెందిన గాజుల అజయ్‌కి 2021లో అదే ప్రాంతానికి చెందిన శివాణితో వివాహం జరిగింది. కొన్ని రోజులు కాపురం సాఫీగా సాగింది. వీరికి రెండు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించాడు. అనంతరం దంపతులు మధ్య కుటుంబ కలహాలు చోటు చేసుకోగా శివాణి కుమారుడిని తీసుకొని తల్లి గారింటికి వెళ్లింది. తల్లిగారితో శివాణి అదే కాలనీలో అద్దెకు ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటుంది. పెద్దల సమక్షంలో ఎన్నోమార్లు పంచాయితీలు జరిగినా సయోధ్య కుదరలేదు. చివరికి మహిళా సంఘాల మద్దతుతో శివాణి నివాసం ఉన్న ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా శివాణి మాట్లాడుతూ తాను చావనన్న చస్తా కాని అజయ్‌తో కాపురానికి మాత్రం వెల్లనని మొండికేయడంతో స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించారు. బ్లూకోల్ట్ సిబ్బంది ఆందోళన చేస్తున్న వారి వద్దకు వెళ్లి సముదాయించి ఇరు వర్గాలను పోలీస్ స్టేషకు తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.



ఆందోళన చేస్తున్న భర్త అజయ్, కుటుంబ సభ్యులు

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంపు



వేతనాలు పెంపు జీవోను అందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో పని చేయుచున్న 15 మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాధాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులు కాపీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉద్యోగులకు ఆదివారం అందించారు. జీవో జారీ విషయంలో పూర్తి స్థాయి సహకారం అందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలకు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేష్

ధర్మపురి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులుగా లసెట్టి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సంపంగి రవి, కోశాధికారిగా అయ్యోరి లక్ష్మీనర్సయ్యను ఎన్నుకున్నారు.

'రైతులు సద్వినియోగం చేసుకోవాలి'

జగిత్యాల అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు తాజా శాస్త్రీయ పద్ధతులు తెలుసుకుని వాటిని అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధికదిగుబడి పొందవచ్చన్నారు.

ఘనంగా జాతర

ఇబ్రహీంపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులోని రత్నాలమడుగు వద్ద ఉన్న శివాలయంలో ఆదివారం జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చన అభిషేకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, కాంగ్రెస్ నాయకులు పెంట లింబాద్రి, మాజీ ఎంపీపీ నెరేళ్ల దేవేందర్, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం దిశగా అడుగులు..

(5వ పేజీ తరువాయి)

పట్టాలు ఎక్కడం, కొందరికి భూమి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా పాస్ బుక్కుల్లో నమోదయ్యాయి. కొందరు తమ భూములను అమ్ముకున్నప్పటికీ వారే దొడ్డిదారిన ఆ భూమిని పాస్‌బుక్కుల్లో ఎక్కించుకోవడం, మరికొందరు కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఒక్కరే పట్టా చేయించుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇలాంటి వాటికి ధరణిలో పరిష్కారం దొరకలేదు. దాంతో కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూ భారతీ ద్వారా ఇలాంటి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించుకునే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవడం, అక్కడా పరిష్కారం కాకపోతే కలెక్టర్‌కు కూడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ధరణిలో పాస్‌బుక్ పొందిన పట్టాదారుడే తిరిగి వేరే వారికి పట్టా చేస్తేనే పేరు మారేది. అధికారులకు దానిని మార్చే అధికారం లేకపోవడంతో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉండేవి. అలాంటి వాటికి భూ భారతిలో మోక్షం లభించనుంది. ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ ఆగిపోతే ఆ డబ్బులు రైతులకు వచ్చేవి కావు. అలాంటివి ఇప్పుడు పరిష్కారయ్యే అవకాశం ఉంది. పట్టా భూమి పొరపాటున ప్రభుత్వ భూమి అని పడితే దాన్ని మార్పు చేయాలంటే సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇలాంటి సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండేవి. ఇప్పుడు వాటితో పాటు అత్యధికంగా ఉన్న సాదాబైనామాలకు మోక్షం లభించే అవకాశం ఉంది.

భూ భారతితో రైతులకు ఎంతో మేలు..
-అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్



భూ భారతి చట్టం రైతులకు ఒక వరం. ధరణిలో పరిష్కారం కాని సమస్యలు భూ భారతి చట్టంలో పరిష్కారం కానున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో పైలట్ మండలంగా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలాన్ని ఎంపిక చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం..
-సత్యప్రసాద్, కలెక్టర్



రైతులకు సంబంధించి ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారం కానున్నాయి. మండలంలోని ప్రతీ రైతు సమస్యను పరిష్కరించి పట్టాలు అందజేస్తాం. ఈనెల 5వ తేదీ నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేసి పిర్యాదులు స్వీకరిస్తాం. వాటిపై గ్రామంలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తాం.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు

కథలాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మండలంలోని పోతారంలో ఆదివారం ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించబడ్డాయని సర్కారు బడికే పంపించాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి వసతులు కల్పిస్తున్నందు వల్ల ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని అన్నారు. ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు నరహరి, శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, గ్రామపెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'సేవా భావాన్ని పెంపొందించుకోవాలి'

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘ్ సంచాలక్ డాక్టర్ భీమనాత్ని శంకర్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో పది రోజులుగా నిర్వహిస్తున్న సంస్కార సాధన శిభిరం ముగింపు కార్యక్రమానిక వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలనే అతిపెద్ద సామాజిక సేవా సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవా విభాగం సేవా భారతి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా లక్షయాభై వేల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఆవాసం అధ్యక్షులు జిడిగే పురుషోత్తం, ఉత్తూరి గంగారాం, కంకనాల నీరజ, మదన్ మోహన్ రావు, తుంగూరి సురేష్, బెజ్జంకి సంపూర్ణచారి గుండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ యూత్ మండల శాఖ అధ్యక్షుడు చెవుల రవీంధర్ తండ్రి రాయలింగు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం పరామర్శించారు. అలాగే, మండలంలోని గంగాదేవి పల్లె తాజామాజీ ఉప సర్పంచ్ కాసాని చంద్రశేఖర్ తండ్రి. మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామంలో గాజంగి మల్లేశం, మండలంలోని దట్నూర్ గ్రామంలో పార్టీ నాయకులు మీసాల వినోద్ తండ్రి ఇటీవల ఆనారోగ్యాలతో బాధపడుతూ మృతి చెందగా మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మల్లన్న పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకులు కడమండల సుధాకర్ తల్లి సుశీల కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతుండగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ఆరోగ్య వివరాలు గూర్చి అడిగితెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అసు పత్రి వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జలేంధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ హన్మండ్లు, తాజామాజీ సర్పంచ్‌లు రాగం శంకరయ్య, బాలుసాని సుజాతరాజ్ కుమార్, నాయకులు కిషన్, రమేష్, గంగాధర్, తిరుపతి, అశోక్ రావు, రాజేందర్, శోభన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా

-ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు పోగొట్టుకున్న పార్టీ సీనియర్ కార్యకర్తకు అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధితుడికి భరోసానిచ్చారు. ఆదివారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్ పల్లె గ్రామానికి చెందిన వడ్లకొండ రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఒక కాలు పోగొట్టుకోగా విషయం తెలుసుకున్న లక్ష్మణ్ కుమార్ బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, తాజామాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, కొండ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కొడిమ్యాల, మే 4(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ బి. లావణ్య తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు.

'దేశానికే ఆదర్శంగా కులగణన'

మెట్‌పల్లిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశానికే రోల్ మోడల్ గా మన కులగణన నిలిచిందాని,దేశం లో ఎక్కడ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టడంతోనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టిందుకు ముందుకు వచ్చారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణి చేశారు. మెట్‌పల్లి పట్టణం, మండలంకు 18 మందికి 7.28 లక్షలు మంజూరు కాగా సంబంధిత చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో అండగా నిలుస్తుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు కోరుట్ల నియోజకవర్గంలో దాదాపుగా మూడు కోట్ల వరకు సీఎం సహాయం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరుపేదలకు పక్క ఇండ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ప్రవేశపెట్టిందని ఇందులో భాగంగానే ఇల్లు లేని నిరుపేదలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కోరుట్ల నియోజకవర్గానికి 350 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇందులో కోరుట్ల పట్టణం 620, మెట్‌పల్లి పట్టణంకు 560, నియోజకవర్గంలోని మిగతాగ్రామాలకు 20 నుండి 30 ఇళ్ల వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇల్లు కట్టించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అడపదడప డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి చేతులు దులుపుకున్నారే తప్ప పేదలకు పక్క ఇండ్లు నిర్మించలేదని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా పథకాలు ప్రవేశపెడుతుంటే జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు రాద్ధంతం చేయడం సమంజసం కాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా రాజీవ్ యువ వికాస్ పథకం ప్రవేశపెట్టిందన్నారు. దీంతో ప్రతి నిరుద్యోగికి ఉపాధి అవకాశం లభించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారాన్నారు. పథకాల అమలు కొద్దిగా ఆలస్యం జరిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మెట్‌పల్లి మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు చెర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, యామ రాజయ్య, భరత్, రవీందర్, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత జువ్వాడి నర్సింగరావు

విద్యార్థికి సన్మానం

కొడిమ్యాల, మే4(ఆంధ్రజ్యోతి) : ఇస్రో వారి యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కొలకాని అశ్వినిని ఆదివారం సన్మానించారు. నాచుపల్లిలో ఆదివారం 1983-1984 సంవత్సరంలో మండల కేంద్రంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతి, జ్ఞాపిక, నగదు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పెద్దపెల్లి జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో సైన్స్ గణితం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల నుండి ప్రతి ఒక్కరు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. సమాజం కోసం కొత్త ఆవిష్కరణలు చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. యంగ్ సైంటిస్ట్ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుగురు ఎంపికైనానరన్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి నుండి అశ్విని ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాదులోని నేషనల్ రిమోట్, సెన్సింగ్ కేంద్రంలో అంతరిక్ష సాంకేతికత అనువర్తనాలపై జరుగు శిక్షణ కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భూమేశ్వర్, కార్యవర్గ సభ్యుడు మహేందర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర

మెట్‌పల్లి రూరల్, మే, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామ దేవత పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభించారు. పెద్దమ్మతల్లిని ఆలయాన్ని మామిడి తోరణాలు, దీపాలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్దమ్మ తల్లిని ప్రత్యేక ఏర్పాటు చేసిన పల్లకిలో ఉంచి గ్రామ పుర వీధుల్లో గుండా డప్పు చప్పుల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, మండలంలోని ఆయా గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



మారమ్మతల్లి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గ్రామ దేవతలకు పూజలు

మెట్‌పల్లి రూరల్, మే, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని మారమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం గ్రామాభివృద్ధి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయానికి డబ్బు చప్పులతో ఊరే గింపుగా ఆలయంకు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మ వారికి గొర్రెపిల్లలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లాడి ప్రభాకర్‌కు 'డాక్టరేట్'

మెట్‌పల్లిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అల్లాడి ప్రభాకర్ ఆదివారం మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ మలేషియ నుండి డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. పల్లె ప్రదేశాలలో ప్రజలకు ఉపయోగపడే పెటెంటెడ్ ఆవిష్కరణలు చేస్తూ సమాజానికి విశేష సేవలందించిన వ్యక్తుల సేవలకు గాను మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటి మలేషియ ఆయనకు డాక్టరేట్ పురస్కారం అందజేసింది. రూరల్ ఇన్నోవేటర్‌గా, సోషల్ టెక్నాలజిస్ట్‌గా ఆయన చేసిన సేవలను గుర్తించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా సత్యనారయణగౌడ్

మెట్‌పల్లిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి గౌడ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా చెట్లపల్లి సత్యానారయణ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా సత్యనారయణ గౌడ్‌ను, ఉపాధ్యక్షులుగా మెరుగు దశగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి రాజేశ్వర్‌గౌడ్, క్యాషియర్‌గా మెరుగు ఏడు కొండలు, కార్యవర్గ సభ్యులుగా అనుపురం సతీష్ గౌడ్,మహేష్, అంజయ్య, నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంను సభ్యులు అభినందించి, శాలువతో ఘనంగా సత్కారించారు.

ఎయిర్ కండిషన్ బస్సులను నడపాలి

కోరుట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాదు - వరంగల్ మార్గంలో ఆర్‌టీసీ యజమాన్యం ఎయిర్ కండీషన్ బస్సులను నడపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుడ్ల మనోహర్ ఆదివారం కోరారు. వరంగల్ - నిజామాబాదు పట్టణాలకు కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల పట్టణానికి చెందిన ప్రజలు నిరంతరం బస్సు సౌకర్యాం ద్వార వెలుతుంటారు. త్రీవ ఎండ తీవ్రతతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోటున్నారని ఆర్‌టీసీ యజమాన్యం గుర్తించి ఆర్‌టీసీకి లాభం చేకునే విధంగా ఏసీ బస్సులను నడిపి ప్రయాణికుల ఇబ్బందులు తోలగించాలని కొరారు.